క్లుప్తంగా

ఉపాధి అవకాశాలపై యువత దృష్టి సారించాలి


కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: యువత స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. బుధవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికలకు కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతో పాటు విద్యార్థులు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. చదువు అయిన తర్వాత ఉద్యోగాలు దొరకనప్పుడు ఉపాధి కోసం కళాశాలలోనే శిక్షణ పొందాలన్నారు. దాతల సహకారంతో కుట్టు మిషన్లు విరాళంగా అందాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం దాతలు బొగ్గరప్పు నరసింహయ్య, సుబ్రహ్మణ్యం, జమాలయ్యను అధ్యాపకులు సన్మానించారు.

మాజీ ఎంపీ పోచా జన్మదిన వేడుకలు


క్యాలెండర్ విడుదల చేస్తున్న మాజీ ఎంపీ పోచా

నంద్యాల(వ్యవసాయం): మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి జన్మదినాన్ని నంది రైతు సమాఖ్య గౌరవ సలహాదారు డాక్టర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేశారు. మాజీ ఎంపీ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా సమాఖ్య విశేష సేవలందిస్తోందని అభినందించారు. డాక్టర్ దీవీ హయగ్రీవాచారి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషఫణి, మహబూబ్‌బాషా, ఓబులపతి, ఎండీ రఫీ పాల్గొన్నారు.

'నాగుండె సవ్వడి' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన సాహితీవేత్త కవి కొప్పుల ప్రసాద్ రచించిన నాగుండె సవ్వడి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో తాజ్‌మహల్ హోటల్‌లో పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి పుస్తక సమీక్ష చేస్తూ ప్రసాద్ కవిత్వంలో ఆనందం, విషాదం రెండు సమపాళ్లలో కనిపిస్తాయని, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీని వారిని తన కవితల్లో తలపింపజేస్తారని, ప్రతి కవితలోను భాష, భావం, శిల్పం సమంగా ఉండేలా చూస్తారని కొనియాడారు. కళారత్న బిక్కి కృష్ణ, గజ్జల్‌క్విన్ పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ గ్రామసభ

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి

గోస్పాడు: పశు పోషకులు పశువుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, జాగ్రత్తలు పాటించాలని యాళ్లూరు పశువైద్యాధికారి అభిలాష్ రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో పశువ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలికాలంలో వచ్చే వ్యాధుల పట్ల జీవాలతో పాటు పశువులను సంరక్షించుకోవాలని తెలిపారు. చల్లటి గాలి తగలకుండా శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చలికాలంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. పశువుల పాకలకు దోమతెరలను వాడటం ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను డీఈఓ జనార్దన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించినట్లు ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పొందు పరిచిన అంశాలు, విద్యాశాఖకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు ఒకేచోట ముద్రించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబశివుడు, మాధవస్వామి, నాయకులు కమలాకర్‌రావు, ఇస్మాయిల్, రామకృష్ణయ్య, జయరాం, విజయ్‌కుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.


మంత్రి ఫరూక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం రజియా సుల్తానా, డిపో మేనేజర్


రుద్రవరంలో గంధం రాఘవరెడ్డికి కేక్ తినిపిస్తున్న దృశ్యం


ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐ కంబగిరిరాముడు, ఎస్‌ఐలు

- వాడవాడలా న్యూ ఇయర్ కోలాహలం
- ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

నవోత్సాహం


ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు,


వైఎస్సార్‌సీపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డికి బొకే అందజేస్తున్న అభిమానులు

నంద్యాల(వ్యవసాయం): గతేడాది మిగిల్చిన జ్ఞాపకాలను మననం చేసుకుంటూ జిల్లా ప్రజలు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం నుంచే నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు జరుపుకునే వేడుకలకు జనం ఏర్పాట్లు చేసుకున్నారు. సంబరాలకు అవసరమైన సరంజామాను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. బుధవారం 2025 సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ప్రజలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి బాణ సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.పట్టణంలో ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రి ఫరూక్, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డికి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు పట్టణంలోని 42వార్డులకు చెందిన ప్రజలతో పాటు నంద్యాల, గోస్పాడు మండలంలోని 40 గ్రామాల పంచాయతీలకు చెందిన ప్రజలు శుభాకాంక్షలు తెలపడానికి తరలిరావడంతో వారి కార్యాలయాలు కిటకిటలాడాయి. బొకేలు, పూలదండలు వద్దు.. మొక్కలు, పుస్తకాలు తీసుకొని రండి అని పిలుపునివ్వడంతో చాలా మంది పుస్తకాలు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగ్ లు, స్కేళ్లు, మొక్కలు, తదితర వాటిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు శుభాకాంక్షల వెల్లువ..

మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా మున్సిపల్ కార్యాలయంలో, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి బొమ్మలసత్రంలోని పార్టీ కార్యాలయంలో, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పీపీ మధుసూదన్‌రెడ్డికి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దేశం సులోచన ఎన్‌జీఓస్ కాలనీలోని తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జిలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద సందడి...

నూతన సంవత్సర శుభాకాంక్షలు తమ పైస్థాయి అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఉద్యోగులు కార్యాలయాల వద్దకు పూలమాలలు, బొకేలు, మిఠాయిలు, పండ్లతో వచ్చిన వారితో ఆయా కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాను సీఐలు, ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ ప్రియదర్శిని, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ నిరంజన్‌రెడ్డికి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

రుద్రవరం: మండలంలో బుధవారంనూతన సంవత్సర వేడుకలను సంబరంగా నిర్వహించారు.2024కు వీడ్కోలు పలుకుతూ అర్ధరాత్రి నుంచే పెద్ద చిన్న తేడా లేకుండా బాణసంచ పేల్చుతూ గ్రామాల్లోని వీధుల్లో ర్యాలీలుగా తిరిగారు.ఉదయం ఒకరినొకరు 2025 కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇందులో భాగంగా రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడును సిబ్బంది, ఎంపీడీఓ భాగ్లలక్ష్మిని కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డిని రుద్రవరంలో నాయకులు, కార్యకర్తలు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

చాగలమర్రి: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, వ్యాపారవేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్‌కు బుధవారం కార్యకర్తలు, అభిమానులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిన్నమకానం వీధిలోని చక్రం కాంప్లెక్స్ నందు స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

తొలి సూర్యోదయం..

దొర్నిపాడు: నూతన సంవత్సవరం 2025కు స్వాగతం పలుకే క్రమంలో బుధవారం చాలా మంది తాము ఈ ఏడాది తొలి సూర్యోదయాన్ని చూశామంటూ ఉదయించే భానుడిని తమ కెమెరాల్లో ఇలా బంధించారు. చీకటి తెరలను చీల్చుకుంటూ సూర్యకిరణాలు నేలను తాకే దృశ్యాలను బంధించారు.


ఉదయిస్తున్న సూర్యుడు


డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

వేడుకలు లేక.. వ్యాపారాలు డీలా..

శిరివెళ్ల: ఈ ఏడాది మండలంలో నూతన సంవత్సర వేడుకలు అనుకుంత స్థాయిలో జరగలేదు. దీంతో కేక్‌లు, పూలు, బొకేలు, పండ్ల అమ్మకాలు డీలా పడ్డాయి. ఎంతో ఆశతో స్టాక్ తెచ్చుపెట్టుకోగా.. చివరకు కొనేవారు లేక వ్యాపారస్తులు నిరాశకు లోనయ్యారు. ప్రధానంగా మండలంలోని యర్రగుంట్ల పూలకు ప్రసిద్ధి. జాతీయ రహదారిపై ఉండటంతో ఆళ్లగడ్డ, నంద్యాలకు వెళ్లే వారు వాహనాలను ఆపి ఇక్కడ పూలు కొంటుంటారు. ఈ ఏడాది నియోజక వర్గంలోని ప్రధాన వర్గాలైన గంగుల, భూమా నేతలు ఆళ్లగడ్డలో లేకపోవడంతో వేడుకలకు కార్యకర్తలు, నాయకులు రాలేదు. దీంతో వారి వ్యాపారాలు జరగక నష్టాలు మూటగట్టుకున్నామని వాపోయారు.


పూలదండలు కొనేవారు లేరంటున్న వ్యాపారి

దొర్నిపాడు:మండలంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఎంపీడీఓ సావిత్రి, తహసీల్దార్ సుభద్ర అలాగే మాజీ సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచ్ మాధవీలత, వెంకటేశ్వర్లు, శివరామిరెడ్డి, లక్కు మాధవి తదితరులు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: కోటి ఆశలు.. కొంగొత్త ఆశయాలతో నియోజకవర్గ ప్రజలు బుధవారం నూతన ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. పాత ఏడాది మిగిల్చిన జ్ఞాపకాలతో సరికొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టారు. వాడ వాడలో చిన్నా పెద్ద అని తేడాలేకుండా ప్రజలంతా సంబరాల్లో మునిగిపోయారు. ఏడాది పొడువునా అందరికీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. పట్టణం మొదలు పల్లెల్లో యువత కేరింతలు కొట్టారు. 2024కి వీడ్కోలు.. 2025కి స్వాగతం పలుకుతూ ఆనంద డోలికల్లో తేలిపోయారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి తమ కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగాలని ప్రార్థించారు. డీఎస్పీ రవికుమార్‌ను సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజ్ అధ్యక్షుడు అమీర్ భాషా ఆధ్వర్యంలో సేకరించిన పెన్నులు, నోట్ పుస్తకాలు పేద పిల్లలకు అందజేయాలని ఎంఈఓ శోభావివేకవతికి అందజేశారు. డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక శిల్పా వెంచర్ గెస్ట్ హౌస్ కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నారు.

మనకు పోటీ వచ్చేదెవరు?

ఆళ్లగడ్డ: నూతన సంవత్సర వేడుకలు నియోజకవర్గంలోని టీడీపీ వర్గాల్లో ఉద్రిక్తతకు దారితీసింది. శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు గోగిశెట్టి నరసింహులు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి తమ సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తలు తరలి రావాలని సుమారు 15 వాహనాలను పంపించారు. విషయం ఎమ్మెల్యే అఖిలప్రియకు తెలియడంతో వేడుకలు జరగకుండా చూడాలని పోలీసులకు సూచించినట్లు సమాచారం. దీంతో పోలీసులు వీరారెడ్డిపల్లెకు చేరుకుని శాంతి భద్రతలకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించడంతో నరసింహరావు హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. తమకు పోటీ వర్గం తయారయ్యే అవకాశముందనే వేడుకలను అడ్డుకున్నారనే విమర్శలు వినిపించాయి.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం


పాల్గొన్న క్రైస్తవులు ,


పాస్టరేట్-3 ఆలయంలో సందేశమిస్తున్న డీసరీ చైర్మన్ నందం ఐజక్

నంద్యాల(న్యూటౌన్): శాంతి సమాధానం ప్రేమ గుణంతో పాటు పాతవి గతించెను, కొత్త వాటివైపు నడుచుకోవాలని పాస్టర్లు సూచించారు. పట్టణంలోని ఆయా చర్చీల్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఉదయం 7గంటలకు ప్రార్థనలు నిర్వహించారు. మానవాళి మధ్య శాంతి, కరుణ, సహోదర ప్రేమను నెలకొల్పేందుకే క్రీస్తు ఈ లోకానికి వచ్చారని ఏసు జననం మానవాళికి రక్షణ కవచమన్నారు. ఇండియా పెంతికోస్తు ప్రార్థనా మందిరం, పవర్ టెంపుల్, ఎలిశద్దాయి ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేసి అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే..హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి డీసరీ చైర్మన్ రెవరెండ్ జోసెఫ్ బాబు, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2(ఆల్‌సెయింట్ చర్చి)లో రెవరెండ్ డీసరీ చైర్మన్ ఇమ్మానియేల్, విజయ్‌కుమార్, జోయల్, పాస్టరేట్-3 డీసరీ చైర్మన్ నందం ఐజక్ గురువులు, పాస్టరేట్-5 గురువులు సుమిత్ర, పాస్టరేట్-6 కాంతారావు గురువులు, ఐపీసీ బిషప్ అన్నాస్, పాస్టర్ జాషువా, ఎలిశద్దాయి ప్రార్థనా మందిరం, సీయోను ప్రార్థనా మందిరం నిర్వాహకులు పాస్టర్ ఏసుదాసు, పెంతెకోస్తు చర్చిలో పాస్టర్ బెంజమెన్ న్యూ ఇయర్ ప్రార్థనల్లో దైవసందేశం అందించారు. వైఎస్సార్ నగర్‌లోని క్రిస్టియన్ అసెంబ్లీ చర్చీల్లో నిర్వాహకులు జయరాజు, పాస్టర్ రాజారావులు న్యూఇయర్ సందేశాన్ని ఇచ్చారు. గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

సిగ్నల్ బోర్డు ప్లీజ్!

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు, కాకరవాడకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో అంకాలమ్మ, గంగమ్మ ఆలయాల సమీపంలో ఉన్న మలుపు ప్రమాదరకరంగా మారింది. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పలు పర్యాయాలు వాహనాలు ఢీకొనడం, బోల్తాపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మలుపు వద్ద వేగని యంత్రణకు సంబంధించి సూచిక బోర్డులు లేవు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


పెద్దయమ్మనూరు, కాకరవాడ ఆర్‌అండ్‌బీ రహదారిలో మలుపు వద్ద సూచిక బోర్డు లేని దృశ్యం

యాగంటిలో భక్తుల సందడి



మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి నూతన సంవత్సరం ప్రారంభ రోజున భక్తులు, పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏకశిలా రూపంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి, రోజురోజుకు పెరుగుతున్న నందీశ్వరుడు, వేంకటేశ్వరస్వామి గుహ, వీరబ్రహ్మేంద్ర స్వామి గుహ, శంకర గుహలను సందర్శించి పూజలు చేశారు.

– బనగానపల్లె రూరల్

- వరి ధాన్యం నిల్వలో మెలకువలు తప్పనిసరి
- క్రిమికీటకాల నిర్మూలనే కీలకం
- అధిక తేమశాతంతో నష్టం

జాగ్రత్తగా భద్రపరుద్దాం!


ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

గోస్పాడు: ప్రస్తుతం ఖరీఫ్ నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కోసిన ధాన్యాన్ని కల్లాలు, బయలు ప్రదేశాలు, రోడ్లపై ఆరబోస్తున్నారు. అయితే ఆరబోసిన ధాన్యాన్ని కొందరు రైతులు మంచి ధర కోసం నిల్వ చేస్తున్నారు. ఇంటికి చేరిన ధాన్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో వరిసాగు ..

ఖరీఫ్‌లో భాగంగా జిల్లాలో ఈ ఏడాది 67 వేల హెక్టార్లలో వరి పైరును రైతులు సాగు చేశారు. అయితే ఇప్పటికే సాగు విస్తీర్ణంలో 85 శాతం కోతలు పూర్తి కాగా 4.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని సంబంధిత అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ధాన్యం నిల్వ చేసుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచిస్తున్నారు.

కోత నుంచే జాగ్రత్తలు..

వరి కంకుల్లో 80 నుంచి 90శాతం గింజలు పసుపు రంగులోకి మారుతున్నప్పుడే పంట కోయాలి. పూర్తిగా ఎండిపోయే వరకు కోయకుండా వదిలేస్తే ధాన్యం పిలకలు వాలిపోయి, గింజలు రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ధాన్యం గింజలపై పగుళ్లు కూడా వస్తాయి. పగిలిన ధాన్యాన్ని మిల్లులో ఆడించే సమయంలో బియ్యం శాతం తగ్గి నూకలు అధికంగా వస్తాయి. దీంతో రైతులకు నష్టం కలిగే అవకాశం ఉంది.

14 శాతానికి మించి తేమ ఉంటే నష్టమే..

ఆహారానికి అవసరమైన ధాన్యం గింజలతో పాటు విత్తనాల కోసం తీసుకునే ధాన్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. ధాన్యం నూర్పిడి చేసిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. ఇదిలాఉండగా వరి ధాన్యాన్ని అప్పటికప్పుడే అమ్మేవారు కొందరైతే గోడౌన్లలో నిల్వ ఉంచుకొని మంచి ధర వచ్చాక అమ్మేవారు మరికొందరు. దీంతో ధాన్యం రంగు మారే అవకాశం ఉంది. సాధారణంగా కోత సమయంలో ధాన్యంలో 20 శాతం తేమ ఉంటుంది. కోసిన తరువాత ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి మించి తేమ ఉంటే బూజు పట్టి గింజ దెబ్బతింటుంది. తడిసిన ధాన్యం అయితే ఆరుబయట బాగా ఆరబెట్టుకోవాలి. నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించినష్టం కలుగజేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినడమే కాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాలు, నివారణ పద్ధతులపై రైతులు అవగాహన కలిగిఉండాలి.

ఎలుకల నివారణకు చర్యలు...

ధాన్యం నిల్వ ఉంచిన పరిసర ప్రాంతాలు, గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింకోరేకులు, రంధ్రాలు లేకుండా వైర్‌మెస్ మూతలు అమర్చాలి.

ముక్క పురుగు...

పంట కోయడానికి ముందు నుంచే ముక్క పురుగు నష్టాన్ని కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వాదశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక ...

ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పైపొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటికి వస్తుంది. ఇది వడ్ల మూటలు,నిల్వ చేసు గిడ్డంగుల్లో అధికంగా కనిపిస్తుంది.

నుసి పురుగు..

దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా ఉంటుంది. ప్రౌఢ కీటకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది.

ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజపై పొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్రనష్టం కలిగిస్తుంది.

రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి



దిగుబడులు చేతికందాక ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడంలో సాగు కంటే ఎక్కువ శ్రద్ధ చూపాలి. పండిన వరి ధాన్యాన్ని సకాలంలో కోతకోయాలి. నూర్పిడి చేసిన వాటిలో తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ధాన్యాన్ని సాధారణంగా అనేక రకాల క్రిమికీటకాలు ఆశిస్తాయి. వీటివల్ల దిగుబడి దెబ్బతిని రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఎక్కడపడితే అక్కడ నిల్వచేయరాదు. సురక్షిత ప్రదేశాల్లో నిల్వచేసుకోవడం మంచిది.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

ఇలా నిల్వ చేయాలి..

తక్కువ ధాన్యాన్ని వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెల్లో ల్వ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీట్‌తో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షపు నీరు లోనికి పోకుండా జాగ్ర త్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచులపైన, లోపల మలాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణం పిచికారీ చేసి ఒకరోజు ఎండబెట్టాలి. ఇలాంటి సంచుల వాడకం వల్ల కీటకాల నుంచి ధాన్యాన్ని రక్షించవచ్చు.


కానాల సమీపంలో ధాన్యాన్ని సంచుల్లో నింపుతున్న దృశ్యం